

అడవిని వీడనున్న గిరిజనం

- నల్లమల నుంచి 5 గ్రామాల తరలింపు
- మైదాన ప్రాంతాలకు వెయ్యికి పైగా కుటుంబాలు
- ఆమోదించిన నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ
- మెరుగైన వసతులు కల్పిస్తామంటున్న అటవీ శాఖ
- పునరావాసానికి 90 శాతం గ్రామస్థుల అంగీకారం



పునరావాసానికి తరలించనున్న వటువర్లపల్లి వ్యూ



పునరావాసానికి తరలించనున్న సార్లపల్లి గ్రామం వ్యూ

దోమలపెంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ పులుల అభయారణ్యంలోని చెంచుపెంటలు, గ్రామాల తరలింపునకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. స్వచ్ఛంద పునరావాసం కోరుకుంటున్న 1,088 కుటుంబాలను మైదాన ప్రాంతాలకు తరలించేందుకు ఎన్‌టీసీఏ (నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ) ఆమోదం తెలిపింది. ప్రభుత్వ పరంగా, అటవీశాఖ నుంచి అందే ప్రయోజనాలు, లాభ నష్టాలపై ఒక అంచనాకు వచ్చాకే వారు మైదాన ప్రాంతాలకు తరలివెళ్లేందుకు ముందుకు వచ్చారు. ఆయా కుటుంబాలకు కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం, బాచారం గ్రామంలో మెరుగైన వసతులతో 250 గజాల స్థలంలో రెండు పడకల ఇల్లు, సాగుయోగ్యమైన 5 ఎకరాల భూమిని ఇచ్చేందుకు అటవీశాఖ అంగీకరించింది. దీంతో చెంచు పెంటలు, గ్రామాలకు చెందిన ప్రజలు అడవిని వీడేందుకు సిద్ధమయ్యారు.

ఎంవోఈఎఫ్‌సీసీ నివేదిక తర్వాతే..

నల్లమల గ్రామాల తరలింపునకు అవసరమైన 1,501 హెక్టార్ల భూమిని రెవెన్యూ శాఖకు బదలాయించేందుకు, పునరావాసం కోరుకుంటున్న కుటుంబాలకు మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర అటవీ శాఖ అమోదం తెలపాల్సి ఉంటుంది. అందుకోసం నిజనిర్ధారణకు మే నెల మొదటి వారంలో బెంగళూరు నుంచి ముగ్గురు సభ్యుల బృందం ఎంవోఈఎఫ్‌సీసీ (మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్టు క్లైమెట్ చేంజ్) వటువర్లపల్లి, కుడిచింతలబైలు, సార్లపల్లి గ్రామాల్లో పర్యటించింది. స్థానికులతో మాట్లాడి వారి స్థితిగతులను అంచనా వేసింది. పునరావాసం కోసం ఎంపిక చేసిన బాచారం గ్రామ సమీపంలోని అటవీ భూమిని కూడా పరిశీలించి, ఎన్‌టీసీఏకు నివేదిక ఇచ్చింది. దీంతో మూడు గ్రామాలు, రెండు చెంచు పెంటల తరలింపునకు అమోదం లభించినట్లు అటవీశాఖ అధికారులు చెప్తున్నారు.

లబ్ధిదారుల గుర్తింపు పూర్తి

సార్లపల్లి గ్రామ పంచాయతీలో 417 మంది లబ్ధిదారులున్నారు. వారిలో ఆప్షన్-1 160, ఆప్షన్-2 257 మంది ఉన్నారు. ఆప్షన్-1లో బీసీ, 112, వోసీ, 6, ఎస్సీ 32, ఎస్టీ 10 కుటుంబాలున్నాయి. ఆప్షన్-2లో బీసీ 127, వోసీ 4, ఎస్‌ఈ 29, ఎస్టీ 97 కుటుంబాలున్నాయి. ఫేజ్-2లోని వటువర్లపల్లిలో 671 మంది లబ్ధిదారులను గుర్తించారు. వారిలో ఆప్షన్-1 311, ఆప్షన్-2 360 కుటుంబాలున్నాయి. ఆప్షన్-2 కోరుకున్న వారిలో బీసీ 107, వోసీ 9, ఎస్సీ 114, ఎస్టీలు 81, ఆప్షన్-2లో బీసీలు 110, వోసీ 6, ఎస్సీ 141, ఎస్టీ 103 కుటుంబాలున్నాయి. మొత్తంగా ఆప్షన్-1 471 కుటుంబాలు, ఆప్షన్-2 617, మొత్తం 1,088 కుటుంబాలను అధికారులు గుర్తించారు.

సందిగ్ధంలో మరికొందరు..

అటవీశాఖ అధికారులు చెప్తున్నట్లుగా పునరావాస కేంద్రంలో అన్ని వసతులు కల్పిస్తారా? ఇక్కడి నుంచి తరలించాక చేతులు దులుపుకుంటారా? అని కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా వృద్ధులు సందిగ్ధంలో ఉన్నారు. ముందు వెళ్లే వారికి కల్పించే వసతులు, వారికి ప్రభుత్వం నుంచి అందే సహకారాన్ని పరిశీలించిన తర్వాతే అడవిని వీడాలని వారు భావిస్తున్నారు. పుట్టి, పెరిగిన ప్రాంతాన్ని వీడి, మరో చోటికి తరలిస్తే బతకలేమని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు వస్తే..

శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారి విస్తరణకు అనుమతించని అటవీశాఖ, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి మాత్రం అంగీకారం తెలిపింది. అందులో భాగంగా అచ్చంపేట మండలంలోని బ్రాహ్మణపల్లి నుంచి శ్రీశైలం వరకు 57 కిలోమీటర్ల మేర రహదారి నిర్మించాలని, అందుకు అవసరమైన రూ. 7,700 కోట్లను సమకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వం కోరడంతో కేంద్రం అంగీకరించినట్లు ఇటీవల కేంద్ర మంత్రి నితీన్ గడ్కరీ వెల్లడించారు. ఈ కారిడార్ నిర్మాణం పూర్తయితే మన్ననూర్, వటువర్లపల్లి, దోమలపెంట గ్రామాల్లో వ్యాపారాలు నిర్వహించుకునే అవకాశం ఉండదని స్థానికులు భావిస్తున్నారు. దీంతో కొందరు సమీప పట్టణ ప్రాంతాల్లో ఇళ్లు, ప్లాట్లు కొనుగోలు చేసుకుంటున్నారు.

దేశంలోనే మొదటి సారి...

అమ్రాబాద్ అభయారణ్యం పరిధిలోని గ్రామాలు, చెంచు పెంటలకు చెందిన 1,088 కుటుంబాలను మైదాన ప్రాంతాలకు తరలించడం దేశంలోనే మొదటిసారి అని అటవీశాఖ అధికారులు చెప్తున్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులను కూడా కుటుంబాలుగా పరిగణిస్తున్నారు. యువకులకు ఇష్టమైన ఆప్షన్‌ను ఎంచుకొనే అవకాశం ఉంటుంది. యువతులకు మాత్రం ఆప్షన్-1 మాత్రమే వర్తింపచేయనున్నారు. ఈ పద్ధతిలో పునరావాసానికి సంబంధించి, ఫెజ్ - 1లో సార్లపల్లి, కుడిచింతలబైలు, తాటిగుండాల, కొల్లంపెంట నుంచి ఆప్షన్-1 కోరుకునేవారికి రూ. 15 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేసి ఇవ్వనున్నారు. ఆప్షన్-2కు అంగీకరించిన వారికి ఐదు ఎకరాల వ్యవసాయ భూమి, 250 చదరపు గజాల స్థలంలో రెండు పడకల ఇంటిని నిర్మించి ఇవ్వనున్నారు. దీంతో పాటు అన్ని రకాల మౌలిక వసతులతో కాలనీ నిర్మించనున్నారు.



చేనేత జౌళి శాఖ మంత్రి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సీఈవో చంద్రశేఖర్

'అమరచింత హ్యాండ్లూమ్'కు ఉత్తమ పురస్కారం

అమరచింత, జూలై 15(ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలోని అమరచింత హ్యాండ్లూమ్ కంపెనీకి రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం లభించింది. హైదరాబాద్‌లో మంగళవారం నాబార్డు వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా కంపెనీ సీఈవో మహంకాళి చంద్రశేఖర్ పురస్కారంతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో నా బార్డు సీజీఎం ఉదయ్ భాస్కర్, రాష్ట్ర టెక్స్ క్యాబ్ చైర్మన్ రవీందర్, ఎస్‌బీఐ సీజీఎం, ఉద్యోగులు పావని, అశోక్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్

7

సీఎం పర్యటనకు చురుకుగా ఏర్పాట్లు

- ఈ నెల 18న రానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- జటప్రోలులో 70 వేల మందితో భారీ బహిరంగ సభ
- ముఖ్య నాయకులతో మంత్రి జూపల్లి సన్నాహక సమావేశం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి, కలెక్టర్, ఎస్పీ

కొల్లాపూర్/ పెంట్లవెల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెంట్లవెల్లి మండలం, జటప్రోలు గ్రామానికి ఈ నెల 18వ తేదీన సీఎం రానున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో కలెక్టర్ బాదావత్ సంతోశ్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పర్యవేక్షిస్తున్నారు. పర్యటనలో భాగంగా జటప్రోలులో రూ. 200 కోట్ల వ్యయంతో 'యంగ్ ఇం డియా ఇంటిగ్రేటెడ్ సమీకృత గురుకుల పాఠశాల' భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. గ్రామంలోని మదన గోపాలస్వామి ఆలయం పరిసరాల్లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. సభకు నియోజకవర్గంలోని 7 మండలాల నుంచి మండలానికి 10 వేల మంది చొప్పున 70 వేల మందిని రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వారిలో 30వేల మంది మహిళలు ఉండేలా కార్యాచరణ ఉండాలని మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. సభ నిర్వహణపై వనపర్తి జిల్లా, కొత్తకోట సమీపంలోని ఓ ప్రైవేటు ఫామ్ హౌస్‌లో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి, కలెక్టర్, ఎస్పీలతో కలిసి జటప్రోలు గ్రామంలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి కొల్లాపూర్ నియోజకవర్గానికి వస్తున్నారని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా, పకడ్బందీగా పర్యటన కొనసాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట అదనపు కలెక్టర్ పి.అమరేందర్, ఆర్డీవో బన్సీలాల్, అధికారులు ఉన్నారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పర్యటన సాగేదిలా...

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 18వ తేదీన ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి, 10.15 గంటలకు జటప్రోలుకు చేరుకుంటారు. 10:30 గంటలకు అభివృద్ధి స్థలాల సందర్శన, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 11:30 గంటలకు రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువకులతో ముఖాముఖి ఉంటుంది. మధ్యాహ్నం 12:15 గంటలకు ప్రభుత్వ సంక్షేమ ప్రాజెక్టులను పరిశీలిస్తారు. ఒంటి గంటకు చిన్నంబావి మండల పరిధిలోని గ్రామంలోని తమ బంధువుల ఇంట్లో మధ్యాహ్న భోజనం చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు జటప్రోలు గ్రామంలోని మదన గోపాలస్వామి ఆలయ పరిసరాల్లో నిర్వహించనున్న బహిరంగ సభా స్థలికి చేరుకుంటారు. 2:15 గంటలకు మంత్రి జూపల్లి, 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగించనున్నారు. సాయంత్రం 4 గంటలకు, షెడ్యూల్ కుదిరితే మీడియా సమావేశం నిర్వహిస్తారు. 4:30 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్తారు.

పారదర్శకతకు పెద్దపీట

- పేదల జీవన ప్రమాణాల మెరుగునకు కృషి
- నిర్దేశిత లక్ష్యాలను సాధించి తీరాలి
- దిశ సమావేశంలో ఎంపీ డాక్టర్ మల్లురవి

నాగర్‌కర్నూల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో ప్రతీ అంశం పారదర్శకంగా ఉండాలని పార్లమెంట్ సభ్యుడు మల్లురవి అధికారులను ఆదేశించారు. పేదల జీవన ప్రమాణాల మెరుగునకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ముందు కు తీసుకెళ్లాలన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మంగళవారం జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశ) నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో దేశంలోనే రాష్ట్రం ముందుండాలంటే జిల్లాలో ప్రభుత్వ పథకాలు, పనులు, ప్రభుత్వ ప్రణాళికలు, లక్ష్యాలను అన్ని శాఖలు సాధించి తీరాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే తనకు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కేటాయించిన లక్ష్యం మేరకు బ్యాంకర్లు అన్ని రంగాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో అభివృద్ధి సాధించేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా పని చేస్తేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని తెలిపారు. జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని నేషనల్ హైవే ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మద్దిమడుగు - మాచారం బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే రుణాల గ్రౌండింగ్‌ను పూర్తి చేయాలని బ్యాంకర్లను కోరారు. వైద్య కళాశాలలో మెరుగైన సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సహకారంతో ప్రతిపాదించిన లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు వారి శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగుతున్నాయన్నారు. ఎమ్మెల్యేలు కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణలు తమ నియోజకవర్గాల పరిధిలో ఉన్న సమస్యలను దిశా కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో పీడీ డీఆర్‌డీఏ చిన్న ఓబులేష్, దిశ కమిటీ సభ్యులు వంకేశరం మణెమ్మ, ఎం.భగవంతురెడ్డి, వి.చిన్నయ్య, మాదవత్ మోతీలాల్, వివిధ శాఖల అధికారులు, వివిధ ప్రభుత్వ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి, వేదికపై ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్

చేపల చెరువులపై కన్నెర్ర

- చికెన్ వ్యర్థాల వినియోగంపై మాజీ ప్రజాప్రతినిధి ఆగ్రహం
- అక్రమ చెరువుల తొలగింపునకు అధికారుల చర్యలు

6

సర్ప సంరక్షకులు

- 10 వేలకు పైగా పాములను రక్షించిన కృష్ణసాగర్
- సదాశివయ్య ఆధ్వర్యంలో జడ్చర్లలో జీవ వైవిధ్య సంరక్షణ కేంద్రం
- నేడు ప్రపంచ పాముల దినోత్సవం

7

క్లిక్.. క్లిక్..



మబ్బుల పందిరి

నీలి ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. అలనాటి సంస్థానాధీశుల వైభవానికి ప్రతీక అయిన రాజ భవనానికి పందిరి వేశాయి. చిరు జల్లులు పడటంతో వాతావరణం చల్లబడింది. బంగ్లా పరిసరాలు మరింత ఆహ్లాదకరంగా మారాయి. ఈ దృశ్యం మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో 'ఆంధ్రజ్యోతి' కంట పడటంతో కెమెరాను క్లిక్కుమనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

ఇందిరమ్మ గృహ ప్రవేశాలకు చీర, సారె

- ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెక్కుల పంపిణీ



స్వయం సహాయక సంఘ సభ్యులకు అందిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రభుత్వ పాలనలో నిర్మించుకుంటున్న ఇందిరమ్మ లబ్ధిదారులకు తన సొంత ఖర్చులతో చీర, సారె పెట్టి గృహప్రవేశాన్ని జరిపిస్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చెప్పారు. వనపర్తి నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబురాల సభకు కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గానికి మంజూరైన 3,500 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని, ప్రతీ ఒక్క గృహ ప్రవేశానికి తాను హాజరౌతానని చెప్పారు. గడిచిన పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఒక్కరికి కూడా కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఒక్క వనపర్తి నియోజకవర్గంలోనే కేవలం 19 నెలల్లో 5350 కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేశామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని, అందుకు అనుగుణంగానే మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి వాటికి మహిళలనే ఓనర్లను చేస్తున్నామన్నారు. గత పదేళ్లలో నిర్వీర్యమైన మహిళ సంఘాలకు అందించే వడ్డీ లేని రుణాలకు మళ్లీ జీవం పోస్తున్నామన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబురాలను మొట్టమొదట వనపర్తిలోనే ఏర్పాటు చేయడం ఈ ప్రాంతంపై సీఎంకు ఉన్న ఆప్యాయతను గుర్తు చేస్తోందన్నారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ చేతిలో పెడితే పదేళ్ల పాలనలో రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేశారని మండిపడ్డారు. మరోసారి ఓటు కోసం ఇంటి ముందుకొచ్చే బీఆర్‌ఎస్ నాయకులకు కర్రు కాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు రూ. 9 కోట్లు వడ్డీ లేని రుణాలు విడుదల చేసినట్లు తెలిపారు. మహిళ సమాఖ్య భవనం కోసం ప్రభుత్వం రూ. 5 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వనపర్తిలో ఆరు నెలల్లో భవన నిర్మాణం పూర్తవుతుందన్నారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 38.80 కోట్ల చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ ఉమాదేవి, అదనపు కలెక్టర్ యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ప్రమోదినిరెడ్డి, శంకర్‌ప్రసాద్, ధనలక్ష్మి, కిచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్
- ఉప్పేరు పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

ధరూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. ధరూర్ మండలంలోని ఉప్పేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు, ప్రసవాలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రిజిస్టర్‌లలో పూర్తి వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. సాధారణ ప్రసవాల సంఖ్యను గణనీయంగా పెంచాలని వైద్యులను ఆదేశించారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఒక అంబులెన్స్‌ను త్వరలోనే కేటాయిస్తామని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. మందుల నిల్వలను జాగ్రత్తగా పర్యవేక్షిస్తూ ఫార్మసిస్టు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సిద్దప్ప, వైద్యులు రాజు, కృష్ణవేణి పాల్గొన్నారు.

తక్షణమే రైతులకు కనెక్షన్లు ఇవ్వండి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ కమర్షియల్ డైరెక్టర్ సీ.హెచ్. చక్రపాణి

పాలమూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలో కనెక్షన్ కావాలని దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ తక్షణమే కనెక్షన్లు ఇవ్వాలని విద్యుత్ కమర్షియల్ డైరెక్టర్ సీహెచ్ చక్రపాణి, సీఈ భిక్షపతి, ఎస్ఈ వెంకటరమేష్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ సమీక్షా సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రైతులకు కనెక్షన్లు ఇవ్వటానికి అవసరమైన సామగ్రి అందుబాటులో ఉంచుతామన్నారు. గృహ, వాణిజ్య, పరిశ్రమలకు సంబంధించిన కొత్త కనెక్షన్లు నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ కలెక్షన్స్, వర్క్ ఆర్డర్ పెండింగ్ తదితర అంశాలను సమీక్షించారు.

ఎరువుల కొరత రాకుండా చూడాలి

» ఏడీఏ మాధవీలత



భూత్పూర్ ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ మాధవీలత

భూత్పూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రైతులకు ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఏవో మురళీధర్‌కు ఏడీఏ మాధవీలత సూచించారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం రైతులకు ఎరువుల అవసరం ఉందని, ఎక్కడ ఎరువుల కొరత రాకుండా చూడాలని అధికారులతో పాటు డీలర్లకు సూచించారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువులతో పాటు రసాయన మందులు అందుబాటులో ఉంచినట్లు ఏవో తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో కూడా ఎరువుల అందుబాటులో ఉండే విధంగా చూడాలని సీఈవో రత్నయ్యకు ఏడీఏ సూచించగా, యూరియా మాత్రమే ఉన్నాయని, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సీఈవో ఏడీఏను కోరారు.

అక్రమంగా తరలుతున్న ధాన్యం, బియ్యం

» చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న గ్రామస్థులు

» తప్పించుకొని పోలీస్ స్టేషన్‌కు చేరిన లారీ



చెక్‌పోస్టులో పట్టుబడి పోలీస్ స్టేషన్‌కు తరలించిన లారీ

గద్వాల, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైస్ మిల్లుల యజమానులు సీఎంఆర్ ధాన్యంను యథేచ్ఛగా విక్రయించుకుంటున్నారు. సివిల్ సప్లయ్ అధికారుల కనుసన్నల్లో సాగుతుండటంతో వారిని పట్టుకునే నాథుడే కరువయ్యారు. తాజాగా మంగళవారం తెల్లవారుజామున కేటీదొడ్డి మండలంలోని ఓ రైస్ మిల్లు నుంచి సీఎంఆర్ ధాన్యంలోడ్‌తో ఒక లారీ, మర ఆడించిన బియ్యం లోడ్‌తో మరోలారీ అక్రమంగా చెక్‌పోస్టు దాటుతుండగా గ్రామస్థులు వెంబడించి పట్టుకున్నారు. చెక్‌పోస్టు అధికారులకు అప్పగించారు. అయితే గ్రామస్థులు వెళ్లిపోయిన కొద్ది సేపటికే బియ్యంలోడ్‌తో ఉన్న లారీ చెక్‌పోస్టు అధికారుల కళ్లు గప్పి తప్పించుకొని రాష్ట్ర సరిహద్దు దాటిపోయింది. దీంతో చేసేదిలేక సీఎంఆర్ ధాన్యంలోడ్‌తో ఉన్న లారీని పోలీసులకు అప్పగించారు. పోలీసులు వెంటనే సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో, వారు అక్కడికి చేరుకొని లారీని స్వాధీనం చేసుకున్నారు. దానిని మరో రైస్‌మిల్లుకు పంపించి విచారణ ప్రారంభించారు. పూర్తి వివరాలు రాబట్టేందుకు విచారణ చేపట్టారు. ఈ విషయంపై సివిల్ సప్లయ్ అధికారి స్వామికుమార్‌కు ఫోన్ చేయగా ఆయన లిఫ్ట్ చేయలేదు.

శాకాంబరీ దేవి అలంకరణలో వాసవీమాత



అచ్చంపేటటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆషాఢం మాసం సందర్భంగా వాసవీ మాత అమ్మవారు శాకాంబరీదేవి అలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయంలో అమ్మవారికి అర్చకులు శ్రీనివాసులు, మహేష్ ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఆషాఢం మాసం సందర్భంగా మహిళలు గోరింటాకు కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బాలరాజు, కమిటీ సభ్యులు శ్రీనివాసులు, కర్ణస్వామి, నరసింహారావు, నరేష్, రఘు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా చేపల వేట

» పట్టించుకోని ఇరు రాష్ట్రాల అటవీశాఖ, జెన్‌కో సంస్థలు



శ్రీశైలం డ్యాం ముందు భాగంలో వలలు వేస్తున్న మత్స్యకారులు

దోమలపెంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం డ్యాం గేట్లను మంగళవారం ఉదయం 9గంటలకు మూసివేయడంతో పాతాళగంగ, లింగాలగట్టు గ్రామాలకు చెందిన మత్స్యకారులు నిబంధనలకు విరుద్ధంగా డ్యాం ముందు భాగంలో చేపల వేట కొనసాగిస్తున్నారు. శ్రీశైలం డ్యాం వెనుక భాగం ఇన్‌క్లాండ్ టన్నెల్ నుంచి ముందు భాగం నుంచి ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం ఎగ్జిట్ టన్నెల్ వరకు మత్స్యకారులు చేపల వేట చేయటం నిషేధం. అయినప్పటికీ విచ్చలవిడిగా వలలు వేసి చేపలు పడుతున్నారు. కొల్లాపూర్ మొదలుకొని సాగర్ వరకు అమ్రాబాద్ అభయారణ్య ప్రాంతంలో ఉన్నందున అటు జంతువులు, ఇటు చేపలు కూడా సంతానోత్పత్తి సమయం కావడం వలన జూలై 1 నుంచి సెప్టెంబరు 30 వరకు మూడు నెలల పాటు అటవీ ప్రాంతంలోకి వెళ్లడం నిషేధం విధించారు. కానీ, చేపట వేట యథాతథంగా జరుగుతున్నా ఆంధ్ర- తెలంగాణ అటవీశాఖ అధికారులు గాని, జెన్‌కో అధికారులుగాని చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

చేపల చెరువులపై కన్నెర్ర

» చికెన్ వ్యర్థాల వినియోగంపై మాజీ ప్రజాప్రతినిధి ఆగ్రహం

» అక్రమ చెరువుల ఎత్తివేతకు రంగం సిద్ధం

» పట్టాదారులకు నోటీసులు జారీ చేసిన అధికారులు

» కలెక్టర్ అనుమతి కోసం ఫైల్ సిద్ధం



ఎర్రవల్లి మండలంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన చేపల చెరువు

గద్వాల, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమ చేపల చెరువులను ఏర్పాటు చేసి చికెన్ వ్యర్థాలు వినియోగిస్తూ పెంపకం చేస్తున్న వారిపై మాజీ ప్రజాప్రతినిధి కన్నెర్ర చేశారు. చికెన్ వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యంతో పాటు నీటి కాలుష్యం జరుగుతుండటం, వ్యవసాయ రైతల నుంచి ఫిర్యాదులు అందుతుండటంతో అధికారులు చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖల నుంచి అనుమతులతో పాటు ఫిషరీష్ అధికారుల నుంచి అనుమతలు లేని చేపల చెరువులను ఎత్తివేసేందుకు సిద్ధం అయ్యారు. అక్రమంగా చెరువులను ఏర్పాటు చేసిన యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

క్యాట్‌ఫిష్‌తో మొదలైన చేపల పెంపకం

జోగుళాంబ గద్వాల జిల్లాలోని ధరూర్, గద్వాల, ఎర్రవల్లి, ఇటిక్యాల మండల పరిధిలో చేపల పెంపకం కోసం కొన్నేళ్లుగా అక్రమంగా చేపల చెరువులు ఏర్పడ్డాయి. మొదట ఆంధ్రా ప్రాంతానికి చెందిన పెంపకం దారులు ఇక్కడి రైతులతో లీజుకు(కౌలు) భూములను తీసుకొని చేపల చెరువులను ఏర్పాటు చేసుకున్నారు. క్యాట్‌ఫిష్‌తో వీరి పెంపకం మొదలైంది. 2012 నుంచి 2020 వరకు క్యాట్‌ఫిష్‌ను పెంచి ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేవారు. మంచి లాభాలు ఉండటంతో మరి కొన్ని చెరువులు ఏర్పడ్డాయి.

వీటి పెంపకానికి చికెన్, కుళ్లిపోయిన కోడిగుడ్లను ఆహారంగా వేసేవారు. తక్కువ పెట్టుబడితో మంచిలాభాలు పొందారు. అయితే క్యాట్‌ఫిష్ నిషేధిత చేప కావడంతో అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసేవారు. ఇలా కొన్నేళ్ల తర్వాత క్యాట్‌ఫిష్‌కు బదులు ఫంగస్, ఇతర చేపల పెంపకానికి శ్రీకారం చుట్టారు. అయితే ఇప్పటికీ వీటికి ఆహారంగా చికెన్, కుళ్లిపోయిన కోడిగుడ్లను ఆహారంగా వేస్తుండటంతో వాతావరణ కాలుష్యం పెరుగుతున్నది. దీంతో చికెన్ వ్యర్థాల సరఫరాను అడ్డుకోవాలని, అనుమతులు లేని చేపల చెరువులను తొలగించాలని ఓ మాజీ ప్రజాప్రతినిధి అధికారులపై కన్నెర్ర చేయడంతో చర్యలు తీసుకోవడానికి అధికారులు సిద్ధం అయ్యారు.

ఎర్రవల్లిలోనే 314 ఎకరాల్లో చెరువులు

అలంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లి మండలంలోనే 314 ఎకరాల్లో అనుమతులు లేని చేపల చెరువులు ఉన్నాయి. ఎక్కువగా అసైన్డ్ భూములలో ఉండటం గమన్హారం. చెరువులు, కాలువల కింద దళితులు, పేద వర్గాల వారికి ఎకరా, రెండు ఎకరాల వరకు అప్పట్లో అసైన్డ్ చేయగా సాగుచేసుకోవడానికి వీలుకాకపోవడంతో ఆంధ్రా ప్రాంతం వారు వచ్చి లీజుకు తీసుకొని చేపల చెరువులు ఏర్పాటు చేసుకున్నారు. ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపురం, షేక్‌పల్లి, ఆర్ గార్లపాడు, కొండేరు, ఇటిక్యాల మండల పరిధిలోని మొగిలిరావుల చెరువు, పెద్దదిన్నె, గోపల్‌దిన్నె శివారులో ఏర్పాటు చేశారు. జూరాల పరివాహకం అయిన లత్తిపురం, బీరోలు, అనంతాపురం, ఖమ్మంపాడు గ్రామాల్లో ఇప్పటికీ ఉన్నాయి. ఇవన్నీ రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖలతో పాటు ఫిషరీష్ అధికారుల నుంచి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసినవే.

చెరువుల యజమానులకు నోటీసులు



జిల్లాలో అనుమతిలేకుండా ఏర్పాటు చేసిన చేపల చెరువుల యజమానులు, వాటి కోసం భూములు ఇచ్చిన రైతులకు నోటీసులు జారీ చేశాం. అనుమతులు తీసుకోపోతే తొలగిస్తాం. చెరువులు, భూములు కౌలుకు ఇచ్చిన రైతుల జాబితాను కలెక్టర్‌కు నివేదించాం. జీవో నెం.28 ప్రకారం చికెన్, కోళ్ల వ్యర్థాలు పట్టుకోవడానికి మాకు అధికారం లేదు. పర్యావరణ పరిరక్షణ కోసం చేపల పెంపకం దారులే నిర్ణయం తీసుకోవాలి.

- షకీలాబాను,
జిల్లా ఫిషరీష్ అధికారి, గద్వాల

కన్నెర్ర ఎవరిపై?

జిల్లాకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి కన్నెర్ర చేయడం, ఆంధ్రాప్రాంతానికి చెందిన వాళ్ల చెరువులను ఏర్పాటు చేసినందుకా..? చికెన్, కుళ్లిన కోడిగుడ్లను సరఫరా చేస్తున్న ఉమ్మడి జిల్లా వ్యాపారిపైనా?, లేదంటే పర్యావరణం దెబ్బతింటుందనా.. అనేది తెలియడం లేదు. జిల్లా అధికారులు మాత్రం చెరువుల జాబితాను, భూములు కౌలుకు ఇచ్చిన పేదవారి జాబితాను సిద్ధంచేసి నోటీసులు జారీ చేశారు. ఒక్క ఎర్రవల్లి మండలంలోనే 452మంది రైతులకు నోటీసులు జారీ అయ్యాయి. ఏళ్ల తరబడి సాగుతున్న ఈ చేపల పెంపకానికి నోటీసులు రావడంతో కౌలుకు ఇచ్చిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

పచ్చటి చెట్లతోనే ప్రాణవాయువు

» తెలంగాణ ఎంపీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ మల్లు రవి

» పంచాయతీరాజ్, అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం



తాడూరులోని కస్తూర్బా బాలికల వసతి గృహం వద్ద వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటుతున్న ఎంపీ డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్

తాడూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వన మహోత్సవ కార్యక్రమంలో అందరూ అధిక సంఖ్యలో మొక్కలు నాటి, భవిష్యత్తు తరాలకు ప్రాణవాయువును ఇవ్వాలని తెలంగాణ ఎంపీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బా వసతి గృహం ప్రాంగణంలో పంచాయతీరాజ్, అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవంలో వారు పాల్గొని మొక్కలు నాటారు. ఎంపీ మాట్లాడుతూ వాతావరణంలో జరుగుతున్న కాలుష్యాన్ని నివారించి సమయానుకూలంగా వర్షాలుకు కురవాలంటే అందుకు ప్రధానంగా మొక్కల పెంపకమేనన్నారు. ప్రభుత్వం చేపట్టే వనమహోత్సవంలో అందరూ పాల్పంచుకొని అత్యధిక సంఖ్యలో మొక్కలు నాటాల్సిందిగా సూచించారు. స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ మనం నాటే మొక్కలు పెరిగి పెద్దవిగా అయినప్పుడే వాటి ద్వారా వచ్చే పచ్చదనం వల్ల ఆహ్లాదకర వాతావరణంగా మిగులుతుందని అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఖాళీ ప్రదేశాలను గుర్తించి అక్కడ విరివిగా మొక్కలు నాటే ప్రక్రియను చేపట్టాలని సూచించారు. నూతన రేషన్‌కార్డుల పంపిణీ అట్టహాసంగా జరిగిందని తెలిపారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ప్రతీ గ్రామానికి ఇచ్చిన లక్ష్యానికనుగుణంగా వన మహోత్సవంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కోరారు. నాటిన మొక్కలకు నీటి సదుపాయం కల్పించి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటే విషయంలో ఎవరూ అలసత్వం వహించవద్దని అధికార యంత్రాంగానికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్‌గోపిడీ, జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్, జిల్లా కేజీబీవీ పర్యవేక్షణ అధికారి శోభారాణి, కేజీబీవీ ప్రత్యేక అధికారి విజయ, తహసీల్దార్ జయంతి, ఎంపీడీవో ఆంజనేయులు, ఏపీవో చంద్రసిద్దార్థ, పంచాయతీరాజ్‌శాఖ, అటవీశాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం నాణ్యతగా చేపట్టాలి

» కెనాల్‌పై నిర్మాణ పనులను పరిశీలించిన అధికారులు

» ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రావు



కొత్తపల్లి తండా వద్ద వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రావు

ఖిల్లాఘణపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని కొత్తపల్లి తండా శివారులో వెళ్తున్న కెనాల్‌పై నూతనంగా నిర్మిస్తున్న వంతెనను నాణ్యవంతంగా నిర్మించాలని ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రావు తెలిపారు. కొత్తపల్లి తండా ప్రధాన రహదారి వద్ద వంతెన నిర్మాణం కోసం కొనసాగుతున్న పనులను మంగళవారం అధికారులతో కలిసి ఈఈ పరిశీలించారు. బుద్దారం రైట్ కెనాల్ నిర్మాణం వల్ల భూములు కోల్పోతున్న రైతులు పరిహారం చెల్లించాలని ఇరిగేషన్ అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బుద్దారం రైట్ మెయిన్ కెనాల్‌ను 21.700 కి. మీ. దూరాన్ని 18 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామని, అట్టి కాలువ మొత్తం 92 చిన్న, పెద్ద వంతెనల నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు.

కొంత మంది రైతులు సకాలంలో భూమికి సంబంధించిన పత్రాలు అందించకపోవడంతో కొంత మంది రైతులకు అవార్డు కావడంతో ఆలస్యం జరిగిందని అన్నారు. ఇప్పటికే కాలువ నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించినట్లు గుర్తు చేశారు. మిగిలిన రైతులకు సంబంధించిన భూ వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఖిల్లాఘణపురం నుంచి వనపర్తి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై కొత్తపల్లి తండా వద్ద నిర్మించే వంతెన నిర్మాణం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. ఇరిగేషన్ జేఈ కమల హాసన్, క్వాలిటీ కంట్రోల్ ఏఈ దేవానందం, కాంట్రాక్టర్ వెంకట్రావ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసంతో ఖాతాలో రూ.55 వేలు మాయం

మద్దూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మద్దూర్ పట్టణానికి చెందిన ఓ అధ్యాపకుడు సైబర్ మోసానికి గురై రూ.55 వేలు నష్టపోయిన సంఘటన ఆల్యంగా వెలుగు చూసింది. పీఎం కిసాన్ ఫైల్ పేరుతో వచ్చిన మెసేజ్‌ను ఓపెన్ చేయగా రాత్రి ఒంటి గంట తర్వాత రూ.500 నుంచి రూ.10 వేల చొప్పున ఇలా 14 సార్లు తన ఖాతాలో తనకు తెలియకుండా రూ.55 వేలు మాయమైయ్యాయి. ఉదయం ఫోన్‌ను పరిశీలిస్తే ఖాతాలో డబ్బులు డ్రా అయినట్లు మెసేజ్ కన్పించడంతో ఆందోళనకు గురై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అంబేడ్కర్ విగ్రహానికి అవమానం

» చేయి విరగ్గొట్టిన గుర్తు తెలియని దుండగులు

» దళితుల అస్థిత్వంపై దాడి

» దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు మంగి విజయ్



లింగసానిపల్లిలో ధ్వంసం చేసిన అంబేడ్కర్ విగ్రహం ధర్నా చేపట్టి మాట్లాడుతున్న దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు మంగి విజయ్

బిజినేపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగసానిపల్లి గ్రామంలో ప్రారంభోత్సవం కాని అంబేడ్కర్ విగ్రహం చేయిని రాళ్లతో కొట్టి విరగ్గొట్టిన ఘటన చోటు చేసుకుంది. గ్రామస్థులు మంగళవారం తెలిపిన వివరాల మేరకు... ఏడాది క్రితం ఓ రాజకీయ నాయకుడి ఆర్థిక సాయంతో అంబేడ్కర్ విగ్రహం ఇప్పించగా గ్రామంలోని బస్టాండ్ సమీపంలో దిమ్మె నిర్మించి విగ్రహానికి ముసుగు కట్టి ఉంచారు. తెల్లవారు జామున ముసుగు తొలిగి చేతి భాగం కిందపడి ఉండటాన్ని గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు రాళ్లతో కొట్టి చేయి భాగాన్ని విరగ్గొట్టి కిందపడేశారు.

కొందరు మతోన్మాదులు అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం ముసుగులో దళితుల అస్థిత్వంపై దాడి చేస్తున్నారని దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు మంగి విజయ్ అన్నారు. మండలంలోని లింగసానిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆవిష్కరించని అంబేడ్కర్ విగ్రహం చేతివేలిని ధ్వంసం చేసినట్లు తెలుసుకొని మంగళవారం వివిధ కుల సంఘాల నాయకులు, బీఎస్పీ నాయకులతో కలిసి ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని చేయి భాగాన్ని విరగ్గొట్టి అవమాన పర్చడం బాధాకరమన్నారు. దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్షించాలని పోలీసులను డిమాండ్ చేశారు. విగ్రహం ధ్వంసం చేసినందుకు నిరసనగా బుధవారం మండల వ్యాప్తంగా బంద్ పాటించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కె.శ్రీనివాస్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని వివిధ సంఘాల నాయకులతో కలిసి ఎస్ఐ కె.శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు.

నిరసన వక్తం చేసిన వారిలో బీఎస్పీ జిల్లా నాయకుడు కొత్తపల్లి కుమార్, ఎంఆర్పీఎస్ జిల్లా నాయకులు కరిగళ్ల దశరథం, విల్సన్, మంగి రాజు, ఏఐటీ యూసీ నాయకుడు అశోక్, నరేందర్ గౌడ్ ఉన్నారు.

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ



ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న హెల్త్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శివబాలాజీరెడ్డి

నారాయణపేట న్యూటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట పట్టణంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని హెల్త్ జాయింట్ డైరెక్టర్ డా.శివబాలాజీరెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. యూపీహెచ్‌సీలో రికార్డులన్ని పరిశీలించి, డాక్టర్ నర్సింహారావుకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా డా.శివబాలాజీరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ మలేరియా, డెంగీ వ్యాధుల పట్ల, పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ శుక్రవారం పట్టణంలో ఫ్రైడే డ్రైడేగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మలేరియా కోఆర్డినేటర్ అశోక్‌కుమార్, యూపీహెచ్‌సీ సూపరింటెండెంట్ సబితారాణి, ల్యాబ్ టెక్నీషియన్ సత్యనారాయణ, ఫార్మాసిస్ట్ ప్రకాశ్‌గౌడ్, ఏఎన్ఎంఎస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్లను అడ్డుకున్న విద్యార్థులు



ఇసుక టిప్పర్లను అడ్డుకున్న విద్యార్థులు, గ్రామస్థులు

మక్తల్ రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని తిరుమలాపూర్ గ్రామ స్టేజీ వద్ద ఇసుక టిప్పర్లను మంగళవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులు అడ్డుకున్నారు. తిరుమలాపూర్ పాఠశాల ముందు నుంచి ఇసుక టిప్పర్లు తిరుగుతుండడంతో దుమ్ము దూళి వస్తోందని, దీంతో తమకు ఇబ్బందిగా మారిందని ఆరోపిస్తూ టిప్పర్లను అడ్డుకొని బైఠాయించారు. రహదారిపై నీళ్లు చల్లి దుమ్ము లేవకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.

డెంగీ కేసు నమోదు



లక్ష్మీపూర్‌లో స్ప్రే నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

దామరగిద్ద, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం లక్ష్మీపూర్ గ్రామంలో డెంగీ కేసు నమోదు అయింది. ఈ సందర్భంగా డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. అలాగే, గ్రామంలో మురికికాల్వలు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి టెమోపాస్ స్ప్రే చేశారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి లార్వా సర్వే చేపట్టారు. డెంగీ సోకిన ఇంట్లో పైరెత్రీమ్ స్ప్రే చేసి ఇంటి చుట్టుపక్కల శుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు చేశారు. దోమలు కుట్టకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు కిష్టమ్మ, శంకర్, చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్లు బాలచంద్రమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న కారు

గద్వాల క్రైం,జూలై 15 (ఆంధ్రజ్యోతి): కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొంది. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ప్రభుత్వ వైద్యుడు ఉదయ్ తన విధులు ముగించుకొని సోమవారం అర్ధరాత్రి ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి బీరెల్లి చౌరస్తా వైపు వస్తుండగా నిద్రమత్తులో కారు అదుపుతప్పి రోడ్డు కిందకు వెళ్లి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్నది. బెలూన్‌లు బయటకు రావడంతో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు.

సర్ప సంరక్షకులు

నేడు ప్రపంచ పాముల దినోత్సవం

- పాములను పట్టుకొని అడవిలో వదులుతున్న అసోసియేట్ ప్రొఫెసర్ సదాశివయ్య, హోంగార్డు కృష్ణసాగర్
- ఇప్పటి వరకు 10 వేలకుపైగా పాములను రక్షించిన కృష్ణసాగర్
- 5 వేలకుపైగా పాములను రక్షించడంతోపాటు పాముల గుడ్లను పొదిగిస్తున్న సదాశివయ్య
- ఆయన ఆధ్వర్యంలో జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీవ వైవిధ్య సంరక్షణ కేంద్రం ఏర్పాటు

జడ్చర్ల / వనపర్తి / అచ్చంపేట రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సదాశివయ్య, వనపర్తి జిల్లా కొత్తకోట ట్రాఫిక్ హోంగార్డు కృష్ణ సాగర్ సర్ప రక్షకులుగా మారారు. జనావాసాల్లోకి పాములు వస్తే.. వాటిని పట్టుకుని సురక్షితంగా అడవుల్లో వదులుతున్నారు. జడ్చర్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జీవవైవిధ్య సంరక్షణ, విద్యా కేంద్రంలో ఎలాంటి ఆధునిక పరికరాలు(హ్యాచర్) లేకుండానే పాములు పెట్టిన గుడ్లు సదాశివయ్య నేతృత్వంలో పొదిగేలా చేస్తున్నారు. వివిధ ప్రాంతాలలో జనావాసాల్లోకి వచ్చిన పాములను పట్టుకోవడం, పరిశోధక ల్యాబ్‌లో పాములు పెట్టిన గుడ్లను వాటిద్వారా పొదిగించి పిల్లలను సంరక్షించడం, ఆపై వాటిని సురక్షితంగా అడవిలో వదిలిపెట్టడం చేస్తున్నారు. వివిధ ప్రాంతాలలో పట్టుకున్న పాములపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. వాటిపై పరిశోధనలు చేసేందుకు ప్రోత్సహిస్తున్నా రు. డాక్టర్ సదాశివయ్య నేతృత్వంలో ప్రతీ సంవత్సరం సుమారు 20 మంది విద్యార్థులకు పాములను పట్టుకునే అంశంలో ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు ఐదు వేల పాములను పట్టుకుని, సంరక్షించి, సురక్షితంగా అడవుల్లో వదిలిపెట్టారు. కళాశాలలోని జీవవైవిధ్య పరిశోధన ల్యాబ్‌లో ఇప్పటి వరకు దాదాపు 85 పాములు పెట్టిన గుడ్ల ద్వారా పాము పిల్లలను ఉత్పత్తి చేశారు. పత్తిని ఉపయోగించి 70 రోజుల పాటు సంప్రదాయ పద్ధతిలో పొదిగించి, వచ్చిన పిల్లలను సంరక్షించడం విశేషం.

10.06 అడుగుల అతిపెద్ద నాగుపాము కుబుసం

దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 7.2 అడుగుల నాగుపాము కుబుసం నమోదు కాగా, జడ్చర్లలోని జీవవైవిధ్య, విద్యా కేంద్రంలో అతిపెద్ద 10.06 అడుగుల నాగుపాము కుబుసాన్ని భద్రపరిచారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం గొరిటలో ఇది లభ్యమైంది. ఈ కుబుసాన్ని సేకరించడం అత్యంత కష్టమైన, సున్నితమైన అంశం. ఆభరణాల తయారీలో, ఇళ్లలో అలంకరణ వస్తువుల్లో ఈ కుబుసాన్ని వినియోగిస్తారు. అలాంటి అత్యంత అరుదైన కుబుసం పరిశోధన కేంద్రంలో ఉండడం విశేషం.


విద్యార్థులకు పాముల గురించి అవగాహన కల్పిస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ సదాశివయ్య (ఫైల్)


పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ సుమన్ (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో 28 జాతుల పాములు

నమ్మకం, సంప్రదాయం అంశంలో పాములకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 28 జాతుల పాములు ఉన్నాయి. అందులో ఆరు జాతులు విషం కలిగివి, ఏడు అర్ధ విషం కలిగినవి, 15 విష రహిత పాములు ఉన్నాయని వృక్షశాస్త్ర అధ్యాపకుడు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సదాశివయ్య చెబుతున్నారు.

ప్రపంచంలోనే మొదటిసారి గుర్తింపు

నాగుపాము అంటేనే పడగపై సులోచనపు గుర్తు, పడగలో రెండు నల్లటి చారలు ఉంటాయి. అయితే 5 నుంచి 6 చోట్ల సులోచన గుర్తు కలిగి ఉన్న నాగు పామును మహబూబ్‌నగర్ జిల్లా వీరన్నపేటలో గుర్తించారు. ఇది ప్రపంచలోనే అరుదైనది. 2024 జూన్‌లో ఈ పామును డాక్టర్ సదాశివయ్య గుర్తించారు. తర్వాత దానిని అడవి ప్రాంతంలో వదిలిపెట్టారు.

ఎన్నో అధ్యయనాలకు అవకాశం

జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జీవ వైవిధ్య సంరక్షణ, విద్యా కేంద్రంలో ఎన్నో అధ్యయనాలకు అవకాశం ఉంది. పాములపై పరిశోధన అంటే సాహసంతో పాటు ఖర్చు, ఓపిక, నిరంతరం అప్రమత్తతతో కూడుకున్నది. సమయం కేటాయించడంతో పాటు కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ప్రపంచంలోనే మొదటిసారిగా సులోచనపు ఆకారం గుర్తు నాగుపాము పడగపై కాకుండా నడుము నుంచి తోక వరకు ఐదు చోట్ల గుర్తించాము. వైవిధ్యంతో కూడిన ఈ నాగుపాముపై లోతైన పరిశోధన జరగాలి. అనేక రకాల పాములలో వైవిధ్యాన్ని గుర్తిస్తూ అధ్యయనాలు పరిశోధన కేంద్రంలో జరుగుతున్నాయి.

- డాక్టర్ సదాశివయ్య,
అసోసియేట్ ప్రొఫెసర్, వృక్షశాస్త్ర అధ్యాపకుడు

పాములను చంపొద్దు

పాముల నుంచి మనుషులనే కాకుండా మనుషుల నుంచి పాములనూ రక్షించడమే ధ్యేయంగా సేవ చేస్తున్నాని నల్లమల వాసి, స్నేక్ క్యాచర్ సుమన్ అన్నారు. సుమన్ వృత్తి జూనియర్ అసిస్టెంట్ కానీ, ప్రవృత్తి మాత్రం స్నేక్ క్యాచర్. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ఉంటున్న సుమన్ ఎవరు పిలిచినా పరుగున వెళ్లి ఎలాంటి పామునైనా పట్టుకుని వాటిని అడవిలోకి తీసుకెళ్లి వదిలేయడం అతని అలవాటు. డిగ్రీలో సైన్స్ గ్రూపు తీసుకోవడం వల్ల, అచ్చంపేట చుట్టుపక్కల, నల్లమల ఫారెస్టులో ఎక్కువగా పాములు ఉండి గ్రామాల్లో నివసించే ప్రజలకు కాటు వేయడం వల్ల మరణాలు సంభవిస్తుండడం వల్ల పాములపై తనకు శ్రద్ధ పెరిగిందన్నారు.

పాములకు భయపడిన ప్రజలు వాటిని చంపుతుండడం వల్ల పర్యావరణ సమతుల్యత పరిరక్షణ దెబ్బతింటుందన్నారు. పొలాల్లో పంటలు పాడు చేసే ఎలుకలు, పందికొక్కులను పాములు ఆహారంగా తీసుకుంటూ పరోక్షంగా పంటలు పాడు కాకుండా రక్షిస్తున్నాయన్నారు. తాను ఇప్పటి వరకు సుమారు వెయ్యికి పైగా పట్టిపాములను అడవిలోకి వదలడం కానీ, అటవీ సిబ్బందికి అప్ప జెప్పడం జరిగిందని పేర్కొన్నారు. ఎలాంటి ఫీజు, చార్జీలు తీసుకోనని, పూర్తిగా సేవా దృక్పథంతో చేస్తున్నానని తెలిపారు.

- స్నేక్ క్యాచర్ సుమన్ విజ్ఞప్తి

పది వేలకుపైగా పాములను పట్టిన కృష్ణసాగర్

వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన హోంగార్డు కృష్ణ సాగర్ కొత్తకోటలో ట్రాఫిక్ హోంగార్డుగా పని చేస్తూ, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నాడు. ఒకప్పుడు తన వ్యవసాయ పొలం వద్ద జెర్రిపోతు పాము అతన్ని కాటేయడంతో భయాందోళనకు గురయ్యాడు. దానిని చంపి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లడంతో అక్కడి వైద్యులు అది విషపూరితమైన పాము కాదని, కరిచినా ఏమీ కాదని చెప్పారు. దాంతో అతను చంపిన పామును చూసి చలించిపోయాడు. తరువాత మెల్లిమెల్లిగా పాములను పట్టుకుని వాటిని సంరక్షించడం మొదలు పెట్టాడు.

పాములతో పాటు మొసళ్లు కూడా..

మొదట్లో కొన్ని నెలల పాటు కృష్ణ సాగర్ ఒక్కడే పాములు పట్టేవాడు. రాను రాను తను పట్టడంతో పాటు పాములను పట్టేందుకు ఇష్టముండి ఆసక్తి చూపే యువతకు కూడా వాటిని ఎలా పట్టాలో మెళకువలు నేర్పించాడు. సాగర్ స్నేక్ సొసైటీ పేరిట దాదాపు 40 మందికి పైగా శిక్షణ ఇచ్చాడు. వారితో కలిసి దాదాపు పదేళ్లుగా పదివేలకు పైగా పాములను పట్టుకుని సంరక్షించాడు. పాములతో పాటు సాగునీటి కాలువల వెంట, రైతు పొలాల్లో కనిపించే మొసళ్లు, చిన్న అడవి జంతువులు, పక్షులను కూడా పట్టుకుని సంరక్షిస్తున్నాడు. ఇతను ఒక్క పైసా ఆశించకుండా జనావాసాల్లోకి వచ్చిన పాములను పడుతున్నాడు.

300 కి.మీ. పైగా పాదయాత్ర

పర్యావరణ పరిరక్షణ కోసం కృష్ణసాగర్ గత ఏడాది అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు 300 కి.మీ. పైగా పాదయాత్ర చేపట్టాడు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, రోడ్డు వెంబడి పాదయాత్ర చేసుకుంటూ అవగాహన కల్పించడంతో పాటు 1000కి పైగా మొక్కలు నాటారు. రెండు సంవత్సరాల నుంచి ఎవరైనా తమ ఇంటి వద్దకు పాము వచ్చిందని ఫోన్ చేస్తే వెళ్లి దానిని పట్టుకుని, వారితో రెండు మొక్కలు నాటిస్తున్నాడు. అతని సేవలను గుర్తించి ప్రజాప్రతినిధులతో పాటు పలువురు సినీ నటులు కూడా అభినందించారు.

ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత సేవ



దాదాపు పది సంవత్సరాలుగా పాములను సంరక్షించడంతో పాటు మనుషులకు హాని కలిగించే జంతువులు కనిపించినా వాటిని పట్టుకుని సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత సేవ చేసేందుకు తన వంతుగా కృషి చేస్తా.

- కృష్ణ సాగర్ ,
సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు

8 యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు3, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద 8 యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ నుంచి 30 వేలకు పైగా క్యూసెక్కుల వరద వస్తున్న కారణంగా ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో నాలుగు యూనిట్లు ప్రారంభించి 2.443 మిలియన్ యూనిట్లను రాబట్టినట్లు తెలిపారు. అలాగే ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 121.849 యూనిట్లను సాధించినట్లు తెలిపారు. అలాగే దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో నాలుగు యూనిట్లు ప్రారంభించి 2.861 మిలియన్ యూనిట్లను చేపట్టగా, ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 144.661 మిలియన్ యూనిట్లను రాబట్టినట్లు ఆయన తెలిపారు. వరద ఇలాగే కొనసాగితే నిర్దేశించిన లక్ష్యాన్ని తొందరలోనే చేరుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

ఆవాజ్ రాష్ట్ర కమిటీ ఎన్నిక

గద్వాల టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆవాజ్ కమిటీ రాష్ట్ర మహాసభల సందర్భంగా రాష్ట్ర నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆవాజ్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త అధ్యక్షుడిగా ఎండీ జబ్బార్, కోశాధికారిగా షేక్ అబ్దుల్ సత్తార్, సీనియర్ ఉపాధ్యక్షుడిగా అతిక్‌ఉర్ రెహమాన్, ఉపాధ్యక్షులుగా అజీజ్ అహ్మద్ ఖాన్, సయ్యద్ ఖాసం, అబ్దుల్ నబి, సహాయ కార్యదర్శులుగా ఎంఏ జబ్బార్, ఎంఏ ఇక్బాల్‌లను ఎన్నుకున్నారు. వీరితో పాటు 30మందిని కమిటీ సభ్యులను ఎన్నుకోగా వారిలో గద్వాలకు చెందిన రెహ్మతుల్లా ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

- 16 మందిపై కేసు నమోదు

పెంట్లవెల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై దాడి చేసి 16 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామన్‌గౌడ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన కథనం ప్రకారం... ఆదివారం సాయంత్రం పెంట్లవెల్లి నుంచి మల్లేశ్వరం వెళ్లే దారిలో పేకాట ఆడుతున్న స్థావరంపై పక్కా సమాచారంతో దాడి చేశారు. 16 మందిపై కేసు నమోదుతో పాటు రూ.28వేల నగదు, 9 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

క్రైం కార్నర్

పట్టపగలే చోరీ

- రూ.లక్ష నగదు.. బంగారు, వెండి ఆభరణాలు చోరీ


చోరీ జరిగిన ఇంట్లో ఆనవాళ్లను సేకరిస్తున్న క్లూస్‌టీం, పోలీసులు

మిడ్జిల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలోని ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయులు లింగం, సుగుణ ఇంట్లో మంగళవారం పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.లక్ష నగదుతో పాటు తులం బంగారు, 8 తులాల వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు కథనం ప్రకారం.. లింగం మిడ్జిల్‌లో, సుగుణ రాణిపేట గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఇద్దరు పాఠశాలకు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి, క్లూస్ టీం సభ్యులు ఇంట్లో ఆనవాళ్లను సేకరించి, ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

మొబైల్ షాప్‌లో చోరీ


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నరేష్ కుమార్

గోపాల్‌పేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో ఓ మొబైల్ షాప్ తాళం పగలగొట్టి ఫోన్‌లు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు షాప్ యాజమాని శివ ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు. బాధితుడు ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వల్లపు శివ గత 5 సంవత్సరాలుగా మండల కేంద్రంలో మొబైల్ షాపు నడిపిస్తున్నాడు. శివ సోమవారం రాత్రి 8 గంటల సమయంలో షాపు మూసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో ఎవరో గుర్తుతెలియని దుండగులు మొబైల్ షాపు షెటర్ తాళాన్ని గడ్డపార సాయంతో విరగ్గొట్టి షాపులోకి ప్రవేశించి నాలుగు పాత మొబైల్ ఫోన్‌లు, చార్జర్‌లు ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న లేడిస్ టైలర్ షాప్ తాళాలు విరగ్గొటారు. ఉదయం రాహుల్ అనే వ్యక్తి చూసి సమాచారం శివకు చెప్పాడు. దీంతో అతడు పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సై నరేష్ కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పేటలో విద్యుత్ బకాయిల లొల్లి

- దోభీలు, నాయీ బ్రాహ్మణుల ఉచిత విద్యుత్ పెండింగ్ బిల్లులు విడుదల చేయని ప్రభుత్వం
- కనెక్షన్ కట్ చేసే పనిలో ట్రాన్స్‌కో
- ఎమ్మెల్యేను ఆశ్రయించిన దోభీ, నాయీ బ్రాహ్మణుల సంఘం నాయకులు
- ట్రాన్స్‌కో ఎస్ఈతో మాట్లాడిన ఎమ్మెల్యే
- తొలగించిన విద్యుత్ కనెక్షన్‌ల పునరుద్ధరణ


పేటలో విద్యుత్ కనెక్షన్‌ను తొలగిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

నారాయణపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దోబీలు, నాయీ బ్రాహ్మణుల ఉచిత విద్యుత్, ఇతరత్రా కనెక్షన్ల తొలగింపు లొల్లి నారాయణపేటలో మంగళవారం హాట్‌టాపిక్‌గా మారింది. ఉచిత విద్యుత్ ఉన్న దోబీ, నాయీ బ్రాహ్మణుల విద్యుత్ బకాయిలను ప్రభుత్వం రెండున్నరేళ్లుగా విడుదల చేయకపోవడంతో ట్రాన్స్‌కోకు పెరిగిపోతున్న విద్యుత్ బిల్లుల బకాయిలు గుదిబండగా మారుతున్నాయి. నారాయణపేటలో దోబీ, నాయీ బ్రాహ్మణులకు సంబంధించి 86 విద్యుత్ కనెక్షన్లు ఉండగా గత ప్రభుత్వం ఉచితంగా విద్యుత్‌ను అందిస్తోంది. ఒక్క నారాయణపేటలోనే బకాయిలు దాదాపు రూ.18 లక్షల వరకు ప్రభుత్వం నుంచి విడుదల కావల్సి ఉందనే వాదన ట్రాన్స్‌కో సిబ్బందిలో వ్యక్తమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా అధిక మొత్తంలో విద్యుత్ బకాయిలు విడుదల కావల్సి ఉంది. కేటగిరీ-2 పరిధిలో ఉండడంతో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా గృహలక్ష్మి పథకంతో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులు చేసి ట్రాన్స్‌కోకు ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తోంది. గృహలక్ష్మి కింద రజక దోబీ, నాయీ బ్రాహ్మణుల విద్యుత్ కనెక్షన్లు రాకపోగా ఉచిత విద్యుత్ ఇస్తున్న తమకు బిల్లుల బకాయిలు అంటూ ఏకంగా నారాయణపేటలో ఎనిమిది విద్యుత్ కనెక్షన్లు తొలగించడంతో ఆందోళనకు గురైన ఆయా సంఘాల నేతలు ట్రాన్స్‌కో సిబ్బందితో వాదించారు. ఉచిత కనెక్షన్ల తొలగింపు తగదంటూ నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు అశోక్, రవి, అనిల్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిని వారు ఆశ్రయించి తమ గోడును విన్నవించుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకటరమణతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయమై ప్రభుత్వంతో మాట్లాడతానన్నారు. కనెక్షన్లు తొలగించి ఇబ్బందులకు గురి చేయకుండా వెంటనే తొలగించిన కనెక్షన్లను పునరుద్ధరించాలని ఆమె ఎస్ఈకి సూచించారు. దీంతో సిబ్బంది ఆగమేఘాల మీద విద్యుత్ కనెక్షన్లను పునరుద్ధరించారు. పేట జిల్లా వ్యాప్తంగా దోభీల విద్యుత్ కనెక్షన్లు 874, నాయీ బ్రాహ్మణుల కనెక్షన్లు 434 ఉన్నాయి. అయితే ప్రభుత్వం నుంచి నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండడంతో పాటు దోబీ, రజకులకు ఉచిత విద్యుత్ ఉందని, ఉచితం ప్రారంభానికి ముందు ఏరియస్ బకాయిలు ఉండడంతో పలు కనెక్షన్లను తొలగించామని ట్రాన్స్‌కో సిబ్బంది చెప్పుకొచ్చారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్

పెబ్బేరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటీయూ జిల్లా 4వ మహాసభలు రెండవ రోజు విజయవంతంగా ముగిసింది. ముందుగా జెండాను ఆవిష్కరించి కార్మిక అమరవీరులకు నివాళులర్పించి మాట్లాడారు. మండలంలోని రంగాపూర్ గ్రామ సమీపంలో ఉన్న ఏబీడీ కంపెనీ యాజమాన్యం కార్మికులపై ఆరాచకాలు ఆపాలని డిమాండ్ చేశారు. కంపెనీలో పని చేస్తున్న హమాలీ సంఘం రిజిస్ట్రేషన్ పేరు మార్పిడి చేసి డి.సి.ఎల్ మార్చాలని అధికారులను కోరారు. బొగ్గు, ఇతర గనుల నుంచి వచ్చే లాభాలలో 50శాతం సంబంధిత కార్మికులు, రైతులు, గిరిజన వర్గాల సంక్షేమం కోసం కేటాయించాలని సూచించారు.

సీఐటీయూ కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మూడు సంవత్సరాల వరకు ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదికను ప్రతినిధులు చర్చించి ఆమోదించారు. ఆవాజు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.జబ్బార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మి, సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి రమేష్, రవిప్రసాద్ గౌడ్, సూర్యవంశం రాము, బుచ్చమ్మని క్సన్, బాలయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రెండవ సారి నాబార్డు అవార్డు

- అవార్డు అందుకున్న ఉప్పునుంతల సొసైటీ చైర్మన్, సీఈవో



వ్యవసాయశాఖ మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న చైర్మన్ సీఈవో

ఉప్పునుంతల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్డులో మంగళవారం నాబార్డు రీజినల్ కార్యాలయంలో 44వ నాబార్డు వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ సేవలు అందిస్తున్న ఉప్పునుంతల సొసైటీని గుర్తించి వ్యవసాయాశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టీఎస్‌సీఏబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సహకార కమిషనర్ సురేంద్రమోహన్, ఎస్ఏపీసీఏబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, నాబార్డు సీజీఎం ఉదయ్‌భాస్కర్ చేతుల మీదుగా ఉప్పునుంతల సొసైటీ చైర్మన్ భూపాల్‌రావు, సంఘం సీఈవో రవీందర్‌రావుకు ఉత్తమ కోఆపరేటివ్ సొసైటీ అవార్డును అందజేశారు. రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు ఈ అవార్డు బాధ్యత పెంచిందని వారు అన్నారు.

వంటావార్పుతో దళితుల నిరసన

పాలమూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మూడు తరాల నుంచి సాగు చేసుకుంటున్న దళితుల భూముల్లో అటవీశాఖ అధికారులు కందకాలు తవ్వి నోట్లో మట్టి కొట్టరాదని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తమ భూములపై తమకు హక్కు కల్పిస్తూ పట్టాలివ్వాలని చేపట్టిన రిలే దీక్ష మంగళవారం రెండోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వంటావార్పుతో వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుగొండకు చెందిన 20మంది దళితులు సర్వేనెంబర్ 431, 432/1 విస్తీర్ణంలో సుమారు 25 ఎకరాల దళితుల భూమి ఆర్ఓఎఫ్ఆర్-2006 అటవీ హక్కులు కల్పించి పట్టాలు ఇవ్వాలన్నారు. దీక్షలకు మద్దతుగా మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపా ల్ ప్రసంగించారు. వెంకటయ్య, బాలనాగయ్య, సత్యం, మహేష్, పెంటమ్మ, నర సమ్మ, కృష్ణ, బాలయ్య, రాములు పాల్గొన్నారు.

కిలోన్నర గంజాయి పట్టివేత?

వనపర్తి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వనప ర్తి పట్టణంలో గంజాయి తీసుకుంటున్న ఇద్ద రు యువకులను పట్టణ పోలీసులు అరెస్టు చేసి, కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకు న్నట్లు సమాచారం. మంగళవారం స్థానికుల సమాచారం మేరకు... రాయిగడ్డ కాలనీ సమీ పంలో కొందరు యువకులు సాయంత్రం 4 గంటల సమయంలో గంజాయి తీసుకుంటు న్నారని పలువురు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారి సమాచారం మేరకు వెంటనే పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గంజాయి తీసుకుంటున్న ఇద్దరు యువకుల ను అదుపులోకి తీసుకున్నారు. వెంటనే వారిని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదుపు లోకి తీసుకున్న యువకులను పూర్తి స్థాయిలో విచారించగా మరో ఇద్దరి సమాచారాన్ని పోలీసులకు అందజేశారు. వారి సమాచారం మేరకు పోలీసులు వెంటనే ఒక దగ్గర నిల్వ ఉంచిన కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసు కున్నట్లు సమాచారం. ఈ విషయంపై పట్టణ ఎస్ఐ హరిప్రసాద్‌ను వివరణ కోరగా ఎలాంటి సమాచారమూ లేదన్నారు.

ప్రైవేటు ఆసుపత్రిలో మహిళ మృతి

- డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన
- డాక్టర్‌పై దాడికి నిరసనగా ప్రైవేటు ఆసుపత్రులు బంద్



యునైటెడ్ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత బంధువులు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని యునైటెడ్ అనే ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సోమవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ ఓ గిరిజన మహిళ మృతి చెందారు. డాక్టర్ల నిర్లక్ష్యంతోనే చనిపోయిందంటూ మృతురాలి బంధువులు ఆసుపత్రిలో ఆందోళన చేశారు. ఇదే క్రమంలో డాక్టర్‌పై దాడిచేశారంటూ ప్రైవేటు డాక్టర్లు కూడా మంగళవారం ఆసుపత్రుల్లో సేవలు నిలిపివేశారు. మృతురాలి కొడుకు శంకర్ కథనం ప్రకారం.. నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన సేనావత్ దేవమ్మ (63) అనే మహిళకు అనారోగ్యం కారణంగా ఈనెల 13న జిల్లా కేంద్రంలోని శెట్టి కాంప్లెక్స్‌లో యునైటెడ్ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. రక్తం తక్కువగా ఉందని, రక్తం ఎక్కించాలని చెప్పడంతో రక్తం తెచ్చి ఇచ్చారు. రక్తం ఎక్కించిన మరుసటి రోజు ఆమె చికిత్స పొందుతూ మృతి చెందారు. డాక్టర్ల నిర్లక్ష్యంగానే తమ తల్లి చనిపోయిందని న్యాయం జరిగే వరకు శవాన్ని ఇక్కడే ఉంచుతామని బైఠాయించారు. దీంతో ఆసుపత్రి యాజమాన్యంతో పాటు ఐఎంఏ యూనియన్ డాక్టర్లు వచ్చి కులం పేరుతో దూషించడమే కాకుండా నానా దుర్భాషలాడారని ఆరోపిస్తూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతికి కారణమైన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి అనుమతిని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు ఆసుపత్రికి వచ్చి నచ్చజెప్పి శవాన్ని జనరల్ ఆసుపత్రికి తరలించారు. కాగా అనారోగ్య సమస్యల వల్లనే ఆమె చనిపోయిందని, ఇందులో మా నిర్లక్ష్యం లేదని ఆసుపత్రి యాజమాన్యాలు అంటున్నాయి. తమపై దాడి చేశారంటూ ఐఎంఏ ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా డాక్టర్లపై దాడికి నిరసనగా పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో అన్ని సేవలు బంద్ చేయించారు.

ఇంటర్వ్యూ..

వేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు

- బ్రహ్మచారి, ఎంపీడీవో, వంగూరు



వంగూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని ఎంపీడీవో బ్రహ్మచారి తెలిపారు. బిల్లుల చెల్లింపులు సక్రమంగా సకాలంలో లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నామని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎంపీడీవో పేర్కొన్నారు.

మండలంలో ఇప్పటి వరకు ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి ?

మొదటి విడతలో 468 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ఇందులో ఇప్పటి వరకు 21 బెస్ లెవల్, 2 లెంటల్ లెవల్ దశలో ఉన్నాయి. బేస్ లెవల్ వాటికి రూ.లక్ష, లెంటల్ లెవల్ వాటికి రూ.1.25 చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమచేశాం.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే నిర్మించుకోవాలా ?

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు 66 గజాల్లో నిర్మించుకోవాలి. లబ్ధిదారుడికి 4 విడతల్లో రూ.5 లక్షలు ప్రభుత్వం నుంచి అందుతుంది.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో రాజకీయ ప్రమేయం లేదంటారా?

ఇళ్ల మంజూరులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదు. బిల్లుల చెల్లింపులో పైరవీకారులకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం. ఇళ్ల మంజూరు పారదర్శకంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

న్యూస్ బాక్స్

కేజీబీవీలో సమస్యలు పరిష్కరించాలి

తాడూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డికి కేజీబీవీ ప్రత్యేక అధికారి విజయ మంగళవారం వినతి పత్రం అందజేశారు. గతంలో కేజీబీవీలో పదవ తరగతి తరగతులు కొనసాగగా ప్రస్తుతం అప్‌గ్రేడ్ అయి 12తరగతుల వరకు కొనసాగుతున్న నేపథ్యంలో గదుల కొరత ఉందని తెలిపారు. అదనపు గదులు మంజూరు చేయడంతో పాటు పాఠశాల ఆవరణలో ఉన్న గ్రౌండ్‌ను విద్యార్థినులకు ఆట స్థలంగా ఏర్పాటు చేసి మరిన్ని సమస్యలను పరిష్కరించాలని ఆమె ఎమ్మెల్యేను కోరారు.

'జీఎల్ఐ కెనాల్ కాల్వగట్టును పునరుద్ధరించాలి'

బిజినేపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు కోతకు గురై తెగిపోయిన జీఎల్ఐ కెనాల్ కాల్వగట్టును పునరుద్ధరించి పొలాలకు వెళ్లేందుకు బాట కష్టాలు తీర్చాలని రైతులు ఇరిగేషన్ శాఖ అధికారులను డిమాండ్ చేశారు. మండలంలోని మంగనూర్ గ్రామ సమీపంలో తెగిపోయిన జీఎల్ఐ కాలువ వద్ద మంగళవారం రైతులు నిరసన వ్యక్తం చేశారు. కెనాల్ కోతకు గురవ్వడంతో పొలాల్లో సాగు పనులు చేసుకునేందుకు బాట లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని మూడేళ్లుగా సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులైన డీఈ, ఈఈలకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో రైతులు గద్వాల శివారెడ్డి, కురుమూర్తి గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కుమార్‌గౌడ్, శంకర్, నరసింహ ఉన్నారు.

సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ఉప్పునుంతల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి స్వప్న ఆధ్వర్యంలో సమగ్ర వ్యాధి నిర్ధరణ పరీక్షలు నిర్వహించారు. 70 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీలు డాక్టర్ అభిలాష్, రజిని, రమేస్‌దిశా, వైద్య బృందం శివకుమార్, పద్మ, శరత్ ఉన్నారు.

ఫైర్ సేఫ్టీ లేని హాస్పిటళ్లు, స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి : కేవీపీఎస్

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఫైర్ సేఫ్టీ లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు ఆసుపత్రులు, పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుంపల్లి అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఫైర్‌సేఫ్టీ అధికారి గిరిధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ జిల్లాలో రోజు రోజుకూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించకుండా ఫైర్ సేఫ్టీనీ విస్మరించాయని పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రైవేటు ఆసుపత్రులు, పాఠశాలలను తనిఖీలు చేసి నిబంధనలు పాటించని అలాంటిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు నవీన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

వయోజన విద్యపై అవగాహన

చారకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం వయోజన విద్య అభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంఈవో ఝాన్సీరాణి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. ఏపీఎం రాములు మాట్లాడుతూ వయోజన విద్య అభివృద్ధికి మండల స్థాయిలోని ప్రతీ గ్రామంలో వీవోఏలు ఒక్కో వలంటీర్‌ను ఏర్పాటు చేసి 15 నుంచి 50 ఏళ్ల మధ్య వున్న 10మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలన్నారు. కేజీబీవీ ఎస్‌వో మంజుల, శ్రీకాంత్, విమల, వీవోఏలు పాల్గొన్నారు.

అధికారుల తప్పిదం..
కలగా సొంత భవనం

- **అధికారుల అశ్రద్ధతో అర్ధాంతరంగా నిలిచిన వివిధ కార్యాలయాల భవనాలు**
- **అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు**
- **ప్రభుత్వ ఆదాయానికి గండి**

కోడేరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాలలో ఉండడంతో ప్రభుత్వానికి నెల నెలా రూ.వేలల్లో గండిపడుతోంది. కొందరు అధికా రుల తప్పిదం వల్ల ప్రభుత్వ కార్యాలయాల పక్కా భవనాలు అర్ధాంతరంగా మధ్యలో నిలిచిపోయాయి. 40ఏళ్ల క్రితం మండలాలు ఏర్పడిన సందర్భంలో మొదటి విడతగా కోడేరు మండలానికి మండల సముదాయం మంజూరైంది. కానీ, అధికారుల, కాంట్రాక్టర్ల అసమర్థత వల్ల నాసిరకం పనులు జరుగుతున్నాయని కొందరు రాజకీయ నాయకులు, స్థానికులు క్వాలిటీ కంట్రోల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో భవనాన్ని మధ్యలోనే వదిలేశారు. అదే కాకుండా మండలంలో బీసీ హాస్టల్ భవన కూడా అధికారుల తప్పిందం వల్ల నిలిచిపోయింది. ఒక సర్వే నెంబరులో రిజిస్ట్రేషన్ చేయగా వేరే సర్వే నెంబర్‌లో భవన నిర్మాణం చేపట్టి మధ్యలోనే బేసు, పిల్లర్ల వరకే ఆగిపోయింది. ఇక మండల మహిళా సమాఖ్య భవనంకోసం నిధులు మంజూరై భవన నిర్మాణం చేపట్టగా పిల్లలర్లు వేసి స్లాబు, గోడలు మధ్య వరకు కట్టి అర్ధాంతరంగా వదిలేశారు. ఇలా అధికారుల అసమర్థత, అశ్రద్ధ నిర్లక్ష్యంతో ప్రభుత్వ భవనాలు పక్కదారి పట్టి మధ్యలో నిలిచిపోయాయి. నేటికి సంవత్సరాలు గడిచినా బీసీ బాలుర వసతి గృహానికి భవనం లేక విద్యార్థులు ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతూ చదువులు కొనసాగిస్తున్నారు. అలాగే మండల మహిళా సమాఖ్య వారికి పక్కా భవనం లేక అద్దె భవనాల్లో నిర్వహిస్తూ మహిళా సంఘాల సభ్యులకు, సిబ్బందికి సరిపడా వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి పక్కా భవనం లేక అధికారులు ఎక్కడ ఎవరు ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. మండలంలో అన్ని వసతులు ఉన్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ భవనాలు ఆగిపోయాయి. నెల నెలా వేల రూపాయాలు ప్రైవేటు వారికిఅద్దె చెల్లిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పక్కా భవనాల నిర్మాణ స్థలాల సమస్యలు తీర్చి పక్కా భవనాల నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్థులు, మండల ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా నిలిచిన మండల మహిళా సమాఖ్య భవనం

పక్కా భవనాలు పూర్తి చేయాలి



మండల కేంద్రంలో ప్రభుత్వ పక్క భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి. పక్కా భవనాలకు స్థలాలు ఉండి నిధులు మంజూరై అధికారుల నిర్లక్ష్యం, ఆశ్రద్ధ వల్ల భవనాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. గత ప్రభుత్వాల హయాంలో భవనం మంజూరైతే అధికారుల, కాంట్రాక్టర్ స్వార్థం వల్ల భవన నిర్మాణం నాసిరకంగా చేపట్టడంతో అర్ధాంతరంగా ఆగిపోయింది. వెంటనే ప్రభుత్వ భవనాలను పూర్తి చేయాలి.

- శివశంకర్ వరప్రసాద్, జనుంపల్లి

లింగోటంలో ఉపాధి హామీ పనులపై గ్రామసభ

అచ్చంపేట రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట మండలం లింగోటం గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పనుల గురించి గ్రామసభ నిర్వహించారు. 2024-25 సంవత్సరానికిగాను లింగోటం గ్రామంలో వివిధ రకాల పనులకుగాను ఉపాధి హామీ పథకం కింద 9లక్షల 1998 రూపాయలు ఖర్చు చేశారు. 15వ రౌండ్ కింద సామాజిక తనిఖీ బృందం పనులు పర్యవేక్షించి గ్రామసభలో వివరించారు. సామాజిక తనిఖీ తరపున డీఆర్‌పీ నాగ ప్రత్యూష, ఫీల్డ్ అసిస్టెంట్ బాలస్వామి, పంచాయతీ కార్యదర్శి లింగస్వామిలు హాజరు కాగా రాజకీయ పార్టీల నాయకులు ఎన్.శ్రీకాంత్, ఎం.బాలమశయ్య, ఎన్.తిరుపతయ్య, మహేశ్వరం, ఎం.తిరుపతయ్య, స్థానికులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ జేఏసీ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నాగర్‌కర్నూల్‌టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ జేఏసీ నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కార్యవర్గం ఏర్పడింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు మందిరంలో సమావేశమైన ఉపాధ్యాయ సంఘాల నాయకులు జిల్లా జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాయ జేఏసీ జిల్లా చైర్మన్‌గా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, గౌరవ చైర్మన్‌గా జీహెచ్‌ఎం సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌శర్మ, జాయింట్ సెక్రెటరీగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.మురళి, ఆర్గనైజింగ్ కన్వీనర్‌గా ఆర్‌యూపీపీటీఎస్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, కోశాధికారిగా బీసీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా తపస్ జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి, డీటీయూ జిల్లా అధ్యక్షుడు గుడిపల్లి నిరంజన్, కోకన్వీనర్లుగా డీటీఎఫ్ శ్రీనివాస్, పీఆర్‌టీయూ లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఎగ్జిక్యూటీవ్ సభ్యులుగా ఎస్టీయూ విశ్వేశ్వర్‌రెడ్డి, పెటా యాదయ్యగౌడ్, టీయూటీఎఫ్ రవీందర్, బీటీఏ వెంకటేష్, పీటీఏ బోరెల్లి రాజు, టీఆర్‌టీఎఫ్ రమేష్, స్పెషల్ ఎడ్యుకేషన్ మహేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ జేఏసీ నూతన కార్యవర్గం డీఈవో రమేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, డీఈవో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల ప్రయోజనాల కోసం రాజీలేని పోరాటం

- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్




మాట్లాడుతున్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్

అచ్చంపేటటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల ప్రయోజనాలను కాపాడే విషయంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ మంగళవారం ఉమామహేశ్వర క్షేత్రంలోని ఆలయ ప్రాంగణంలో జిల్లా నూతన కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టుల ప్రయోజనాలను కాపాడే విషయంలో రాజీలేని పోరాటం చేస్తుందని అన్నారు. అనంతరం ఆలయ అధ్యక్షుడు మాధవరెడ్డి, ఈవో శ్రీనివాస్‌రావును కలిసి గుర్తింపు కలిగిన జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత ప్రత్యేక దర్శనం కల్పించాలని వినతి పత్రం అందజేశారు. నల్లమల ఫారెస్ట్‌లోని అన్ని చెక్‌పోస్టులలో ఉమ్మడి జిల్లాలోని జర్నలిస్టులకు టోల్‌టాక్స్‌ను మినహాయించాలని జిల్లా అటవీ శాఖ అధికారిని కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, జిల్లా మాజీ అధ్యక్షుడు గోలి సుదర్శన్, కర్ణయ్య, అచ్చంపేట డివిజన్ అధ్యక్షుడు సాయిబాబు, జర్నలిస్టులు, బాలరాజు, శ్రీదర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

చెరపలేనిది కమ్యూనిస్టుల చరిత్ర

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కే.కేశవులు గౌడ్



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కేశవులుగౌడ్

తెలకపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కమ్యూనిస్టుల పోరాటం చరిత్రలో చెరపలేనిదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కే.కేశవులు గౌడ్ అన్నారు. ఆగస్టు 1, 2 తేదీలో కల్వకుర్తి పట్టణంలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా 3 మహాసభలను జయప్రదం చేయాలి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ మండల సహాయ కార్యదర్శి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. కేశవులుగౌడ్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరం నుంచి మొదలుకొని నేటి వరకు పేదల సంక్షేమం కోసం వారి పక్షాన నిలబడి పోరాడుతున్నది సీపీఐ అని అన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి సూర్యశంకర్ గౌడ్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు డి. బాలమురళీకృష్ణ, మండల కార్యదర్శి వేనేపల్లి రవీందర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.ఆంజనేయులు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

- **అసభ్య పదజాలంతో దూషిస్తున్న యూనియన్ బ్యాంకు మేనేజర్**
- **చారకొండలో బ్యాంకు ముందు రైతులు, ఖాతాదారుల నిరసన**



యూనియన్ బ్యాంకు ముందు నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, ఖాతాదారులు

చారకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు మేనేజర్ రమేష్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు, ఖాతాదారులు డిమాండ్ చేశారు. బ్యాంకుకు వచ్చే ఖాతాదారుల, రైతులపై మేనేజర్ దురుసుగా ప్రవర్తిస్తు న్నారని, ఆయన తీరు మార్చుకో వాలని మంగళవారం బ్యాంకు ముందు పలువురు రైతులు, ఖాతాదారులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ వివిధ పనుల మీద బ్యాంకుకు వచ్చే రైతులు, ఖాతాదారులు, మహిళలకు, వృద్ధులకు సరైన సేవలు అందించకుండా రోజుల తరబడి బ్యాంకు చుట్టూ తిప్పుకుంటూ ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై సహనం కోల్పోయి దురుసుగా మాట్లాడుతున్నారని తెలిపారు. ఒక్కోసారి రెచ్చిపోయి కొందరిపైన ప్రత్యక్షదాడులకు సైతం పాల్పడుతూ, వారిని బ్యాంకు నుంచి గెంటేసే అంతటి పని చేస్తున్నారని ఖాతాదారులు అన్నారు. మేనేజర్ వైఖరి పట్ల ఈనెల 11న బ్యాంకు ముందు రైతులు, ఖదారులు ఆందోళన చేసినప్పటికీ మేనేజర్ తీరు మారక పోవడంతో బ్యాంకు మేనేజర్ రమేష్‌ను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

మాదాసి కురువ, మాదరి కురువ సంఘం మండల కమిటీ ఎన్నిక

పెంట్లవెల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మాదాసి కురువ, మాదారి కురువ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా బెల్లరి మౌలాలి, గౌరవ అధ్యక్షులుగా గజ్జి ఎల్లయ్య, నాగన్న, ఉపాధ్యక్షులుగా గురు పరశురాముడు, గోపాల ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా జ్ఞానేశ్వర్, కోశాధికారిగా బీరయ్య, సహాయ కార్యదర్శిగా రామారి రాజు, చిటకొండ రాముడు, సభ్యులు మల్లికార్జున్, కృష్ణయ్య, వెంకటేష్, రాజు, బీరయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బీరయ్య, ధర్మయ్య, జిల్లా నాయకులు గోపాల శేషయ్య, వెంకటస్వామి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఖాతాల్లో వడ్డీ లేని రుణాలు జమ

తెలకపల్లి జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాల ఖాతాల్లో జమ అయినట్లు ఏపీఎం చంద్రయ్య తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 01.04.2024 నుండి 30.09.2024 వరకు 6 నెలలకు సంబంధించిన వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాల పొదుపు ఖాతాలలో ఈనెల 14న జమ చేశారని తెలిపారు. మండలంలోని 32 గ్రామ సంఘాలలోని క్రమం తప్పకుండా అప్పు చెల్లించిన మొత్తం 552 స్వయం సహాయ సంఘాలకు రూ.66 లక్షల 35 వేలు వారి సంఘం ఖాతాలలో జమ అయ్యాయని తెలిపారు.

'ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు గోప్లాపురం గ్రామం పేరు పెట్టాలి'

పెంట్లవెల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : గోప్లాపురం గ్రామ రెవెన్యూ శివారులో ఏర్పాటు చేసే ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు గోప్లాపురం విలేజ్ పేరు పెట్టాలని గోప్లాపురం రైతు కమిటీ నాయకులు గురుక ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ విజయసింహకు అదే విధంగా కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల గోప్లాపురం శివారులో కడుతున్నందుకు శిలాఫలకంపై గోప్లాపురం గ్రామం పేరు రాయాలని జటప్రోలు రైతు కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, రైతు కమిటీ నాయకులు రామకృష్ణగౌడ్, భాస్కర్‌రెడ్డి, కురుమయ్య పాల్గొన్నారు.

'గోకారం రిజర్వాయర్ నిర్మాణం పనులు త్వరితగతిన చేపట్టాలి'

చారకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోకారం రిజర్వాయర్ నిర్మాణ పనులను త్వరతగతిన చేపట్టి పూర్తి చేయాలని బీజేపీ యువమోర్చా మండల నాయకుడు చింతల్లి కిరణ్‌గౌడ్ అన్నారు. మంగళవారం చారకొండలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం గోకారం వద్ద రిజర్వాయర్‌ను ఏర్పాటు చేసేందుకు గోకారం చెరువును ధ్వంసం చేసి నిర్మించకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఈప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రిజర్వాయర్ ఏర్పాటు చేస్తే మత్స్య కారులకు ఉపాధితో పాటు భూగర్భంగా జలాలు పెరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కన్నా, శ్రీకాంత్, వెంకటయ్య, పవన్, శివ పాల్గొన్నారు.

మద్యంతాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనం నడిపిన గాలిగోటి మల్లేష్ రెండు రోజులు జైలు శిక్షతో పాటు 2000రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా మొదటి శ్రేణి న్యాయాధికారి శృతిదూత తీర్పు ఇచ్చారని ఎస్ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. సోమవారం మద్యం తాగి వాహనం నడుపుతూ నెల్లికొండ గేట్ సమీపంలో తెలకపల్లి మండలం నడిగడ్డకు చెందిన మల్లేష్ నాగర్‌కర్నూల్ పోలీసులకు పట్టుబడినట్లు ఎస్ఐ తెలిపారు. ఇతని కోర్టులో ప్రవేశపెట్టగా జిల్లా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ శిక్షను విధించారనిఎస్ఐ తెలిపారు.

రెండు పశువుల అపహరణ

చారకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారంతండాకు చెందిన పశువుల పద్మకు చెందిన ఆవు, జాటావత్ చాగోలికి చెందిన ఎద్దు వారి వ్యవసాయ పొలంలో కట్టేసి ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఎస్ఐ శంషుద్దీన్‌తెలిపారు. మంగళవారం ఫిర్యాదు చేశారు. వాటి విలువ రూ. 60 వేలు ఉంటాయని రైతులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన



జటప్రోలులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

పెంట్లవెల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ఉద్దేశించి మంగళవారం ఏర్పాట్లు ముమ్మరంగా కొన సాగుతున్నాయి. నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సాయంత్రం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్థానిక పోలీసులకు సూచించారు. అదే విధంగా సభా స్థలాన్ని పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, కొల్లాపూర్ సీఐ మహేష్‌కుమార్, ఎస్ఐ రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన నర్సింహులు

కోడేరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కోడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మంగళవారం బగవేణి నర్సింహులు బాధ్యతలు చేపట్టారు. గతంలో సీనియర్ సివిక్స్ అధ్యాపకురాలు పద్మావతమ్మ ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్ నుంచి బాధ్యతలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. జిల్లా ఇంటర్ విద్యాకార్యాలయ సీనియర్ అసి స్టెంట్, నాన్ టీచింగ్ స్టాఫ్ రీజనల్ సెక్రెటరి ఎంఎ నిరంజన్ ఆధ్వర్యంలో కళాశాల జూనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణ ఏర్పాట్లు చేయగా కళాశాల ప్రిన్సిపా ల్‌గా ఆయన బాధ్యతలు చేపట్టిన ట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రయత్నిస్తానని, అదే విధంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామన్నారు. కళాశాల విద్యార్థులకు అటాచ్డ్ హాస్టల్ ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు



పాలెంలో విద్యుత్ సబ్ స్టేషన్ పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ మండల నాయకులు

బిజినేపల్లి, జూలై15 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయని కాంగ్రెస్ మండల నాయకుడు గోవిందు రామకృష్ణ అన్నారు. మండలంలోని పాలెంలోని ఇండస్ట్రియల్ పార్కు ఆవరణలో చేపట్టిన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం పనులను మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించి మాట్లాడారు. గత ప్రభుత్వం సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేయడంతో గుడ్లనర్వ, ఖానాపూర్, లింగసానిపల్లి, కారుకొండ, పాలెం గ్రామాల్లో రైతులు, ప్రజలు విద్యుత్ సరఫరాలో నిత్యం అంతరాయం కల్గి ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డిలు ప్రత్యేక చొరవ చూపి రూ.2.35 కోట్ల నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రెండు నెలల్లోనే పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరా చేసేందుకు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టినట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మస్కూరి బంగారయ్య, వెంకట్, జయకృష్ణ, ఉదయ్ కుమార్, జగ్గని రామకృష్ణ ఉన్నారు.

కాలనీలలో సమస్యల పరిష్కారానికి కృషి

- మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు



5వ వార్డులో ఇందిరమ్మ ఇంటి భూమిపూజ చేస్తున్న చైర్మన్

అచ్చంపేటటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కాలనీలలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టామని మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పట్టణంలోని 5, 13వ వార్డులలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందజేయడం జరుగుతుందన్నారు. కాలనీలలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్ర మంలో కౌన్సిలర్ ఆకుల వెంకటేష్, రాఘవులు, ఖాదర్ పాషా, కపిలవాయి శేఖర్, లక్ష్మణ్, విష్ణు, లాలు యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని అధికారులు కాపాడాలి

- బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బల్మూరి జానకి



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అచ్చంపేటటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 293 సర్వే నెంబర్‌లో గల 4 ఎకరాల 32 గుంటల భూమి కబ్జా చేసిన వారి నుంచి కాపాడి పేదలకు పంచాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బల్మూరి జానకి అన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో మాధవిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ భూమిని యూసుఫ్ పేరుపైన ఏవిధంగా పట్టాచేశారు, అతను ఆర్మీలో పనిచేశారా లేదా అన్న విషయంపై విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంగ్యానాయక్, సీనియర్ నాయకులు నాగరాజు, బాలాజీ, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు రవీందర్, వెంకటేష్, లీలాబాయి పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులను నమ్మొద్దు

- మానవ అక్రమ రవాణా నిరోధక విభాగపు సీఐ శంకర్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శంకర్

తిమ్మాజిపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని, వారి నుంచి వచ్చే ఫోన్‌లకు స్పందించవద్దని మానవ అక్రమ రవాణా నిరోధక విభాగపు సీఐ శంకర్ అన్నారు. భరోసా కేంద్రం నాగర్‌కర్నూల్ వారి ఆధ్వర్యంలో తిమ్మాజిపేట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఆవరణలో విద్యార్థిని, విద్యార్థులకు షీటీం అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శంకర్, మహిళా ఎస్ఐ రమాదేవిలు మాట్లాడుతూ భరోసా కేంద్రం అమ్మాయిలకు అండగా ఉంటుందన్నారు. విద్యార్థినులు జాగ్రత్తలు పాటించాలని మాయ మాటలకు మోసపోవద్దన్నారు. అమ్మాయిలు ఎవరైనా వేధింపులకు గురిచేస్తే వెంటనే షీటీమ్ ఫోన్ నెంబరు 8712657676కు సమాచారం ఇవ్వాలని అందుకు ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. షీటీమ్ ఇన్‌చార్జి ఏఎస్ఐ విజయలక్ష్మి, భరోసా కోఆర్డినేటర్ శ్రీలత, షీటీం సభ్యులు వెంకటయ్య, శేఖర్‌గౌడ్, ఎంఈవో సత్యనారాయణశెట్టి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

కొల్లాపూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఉన్న జర్నలిస్టులు ఇళ్లస్థలాల కోసం 21 రోజుల నుంచి దీక్షలు చేపట్టినప్పటికీ తఅధికారులు, స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు పట్టించుకోకపోవడం శోచనీయమని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు రామచంద్రయ్య, నియోజకవర్గ కన్వీనర్ జలకం మద్దిలేటి అన్నారు. మంగళవారం జర్నలిస్టులు కొల్లాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు 21 రోజుకు చేరుకున్నాయి. నేటి వరకు మా సమస్యలు పరిష్కారం కానందునే దీక్షలకు దిగామన్నారు. ఇప్పటికైనా జర్నలిస్టుల పక్షాన సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. మల్లికార్జున సాగర్ జర్నలిస్టులు కురుమయ్య, సీపీ నాయుడు, కారంగి గోవిందు పాల్గొన్నారు.